

జలపాతాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ సూచన

పాడేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వరదల నేపథ్యంలో ఉధృతంగా ఉన్న జలపాతాల వద్ద పర్యాటకులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. శనివారం అనంతగిరి మండలం సరియా జలపాతంలో ఇద్దరు గల్లంతైన నేపథ్యంలో రాత్రి ఆయన అత్యవసర ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో సరియా, కటికి, కొత్తపల్లి, యర్రవరం, గాదిగుమ్మి, ... మిగతా 8వ పేజీలో

గిరి శిఖర గ్రామాలకు గండమే!

- ప్రకృతి విపత్తులొస్తే దేవుడే దిక్కు
- కొండవాలులో పదుల సంఖ్యలో పల్లెలు
- చత్రాపల్లి, నిమ్మచెట్టు ఘటనలతో భయం..భయం
- గిరి శిఖర గ్రామాల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ అవసరం



కొండచరియల బారిన పడిన జీకేవీధి మండలం చత్రాపల్లి గ్రామం (ఫైల్)

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

ప్రకృతి వైపరీత్యాలు, మారుతున్న భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో ఇన్నాళ్లు ఎంతో సురక్షితంగా ఉన్న గిరి శిఖర గ్రామాల గిరిజనులు తాజా ఘటనలతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తోంది. గత నెలలో కేరళ రాష్ట్రం వయనాడ్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడిన ఘటన దేశవ్యాప్తంగా సంచలనమైంది. అలాగే తాజాగా వాయుగుండం ప్రభావంతో జిల్లాలోని జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ చత్రాపల్లిలో అటువంటి ఘటనలో ఒక యువతి మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. అలాగే అదే పంచాయతీలో నిమ్మచెట్టు అనే మరో గ్రామంలోనూ కొండచరియలు పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో మన్యంలోని గిరి శిఖర గ్రామాల రక్షణ మరోమారు చర్చనీయాంశమైంది.

పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల్లో 244 గ్రామ పంచాయతీల పరిధిలో 3,915 గిరిజన పల్లెల్లో ఏడు లక్షల మంది గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. మొత్తం గ్రామాల్లో సగానికి పైగా పల్లెలు మారుమూల గిరి శిఖర ప్రాంతాల్లోనే ఉన్నాయి. జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ గిరిజన పల్లెలు కొండవాలునే ఉన్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో కొండలకు చేరువగా ఉన్న పల్లెలకు దూరంగా వాగులు ఉండగా.. మరికొన్ని



చత్రాపల్లిలో ఇళ్లపైకి వచ్చిన కొండ మట్టి, చెట్లు (ఫైల్)

పల్లెలకు అత్యంత సమీపంలోనే వాగులున్నాయి. అయితే భౌగోళిక పరిస్థితుల్లో మార్పులతో వాయుగుండం లేదా అల్పపీడనాలు ఏర్పడితే గిరిజన ప్రాంతంలో కుండపోతగా, ఏకధాటిగా వర్షాలు కురుస్తున్నాయి. ఆ సమయంలో ఏ ప్రాంతంలో ఎటువంటి ఘటనలు చోటుచేసుకుంటాయోననే ఆందోళన అటు ప్రజల్లో, ఇటు అధికార యంత్రాంగంలోనూ కలుగుతున్నది.

విభిన్న భౌగోళిక పరిస్థితులతో ఇబ్బందులు

ఇతర ప్రాంతాల్లో కంటే మన్యంలో భౌగోళికంగా విభిన్నమైన పరిస్థితులుండడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దేశంలో ఎక్కడ వాయుగుండం లేదా అల్పపీడనం ఏర్పడినా దాని ప్రభావం మన్యంపై తప్పకుండా పడుతున్నది. దీంతో అరేబియా సముంద్రలో వాయుగుండం ఏర్పడి తమిళనాడు, కేరళలో భారీ వర్షాలు కురుస్తుంటే.. అక్కడికి పోటీ అన్నట్టుగా గిరిజన మండలాల్లోనూ వర్షాలు కురుస్తాయి. మన్యం భౌగోళిక నైసర్గిక స్వరూపం కారణంగా ఛతీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణా రాష్ట్రాలకు సరిహద్దులో గిరిజన ప్రాంత ఉంది. దీంతో ఛతీస్‌గఢ్, పశ్చిమబంగా, ఒడిశా, తెలంగాణా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌ల్లో ఎక్కడ వరదలు వచ్చినా ఆ ప్రభావం పాడేరు మన్యంపై పడుతున్నది. దీంతో కాలాలతో సంబంధం లేకుండానే గిరిజన ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు పచ్చదనం హరించుపోతుండడంతో కొండలు సైతం పటిష్టతను కోల్పోతున్నాయి. ఈ క్రమంలో భారీ వర్షాలు కురిస్తే కొండ చరియలు విరిగిపడడం, చెట్లు కూలడం వంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ప్రత్యేక కార్యాచరణ అవసరం

గిరి శిఖర గ్రామాల రక్షణకు పాలకులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు తాత్కాలిక హడావిడి.. బాధితులకు ప్రత్యామ్నాయం వసతి, ఇతర సదుపాయాలు కల్పించడం మినహా గిరిశిఖర గ్రామాల రక్షణపై ప్రత్యేక చర్యలు లేవు. 2014లో సంభవించిన హుద్‌హుద్ తుపానుకు అరకులోయ మండలం మేదరశాల గ్రామం వరద వచ్చిన కొండ మట్టిలో కూరుకుపోయి ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. అరకులోయ మండలం కోడిపుంజువలస గ్రామంలో 2006లో వయనాడ్ తరహాలో కొండచరియ ... మిగతా 8వ పేజీలో

బొర్రా గుహలకు మహర్దశ

స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.30 కోట్లు మంజూరు

- వీటిలో రూ.24.1 కోట్లతో అభివృద్ధి పనులు
- గుహల్లో సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు
- ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు
- నిర్మాణం, నిర్వహణకు ఆర్‌పీఎఫ్ ఆహ్వానం
- ఏడాదిలోగా పనులు పూర్తిచేయాలని నిబంధన



బొర్రా గుహల్లో ఏర్పాటు చేయనున్న సౌండ్ సిస్టమ్.. లైటింగ్ మోడల్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రపంచ ప్రఖ్యాతి చెందిన బొర్రా గుహలకు మహర్దశ పట్టనుంది. వీటిని అభివృద్ధి చేయడానికి, పర్యాటకులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ 2.0 కింద రూ.30 కోట్లు మంజూరుచేసింది. వీటిలో రూ.24.1 కోట్లతో పూర్తిస్థాయిలో వసతులు కల్పించడానికి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) ఆసక్తి వ్యక్తీకరణ కోసం ప్రకటన ఇచ్చింది. ఈ ప్రాజెక్టును నిర్మించి, నిర్వహించడానికి ఐదేళ్ల కాలానికి కాంట్రాక్టు ఇవ్వనుంది. ఇది పూర్తయితే బొర్రా వెళ్లే పర్యాటకులకు కొత్త అనుభూతి కలుగుతుంది. ప్రయాణం, పర్యటన సౌకర్యవంతంగా ఉంటుంది. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

లక్షల ఏళ్ల చరిత్ర

బొర్రా గుహలు ఈనాటివి కావు. 1500 లక్షల సంవత్సరాల చరిత్ర వాటి సొంతం. ఇవి విశాఖపట్నానికి 90 కి.మీ., ఏజెన్సీలో పర్యాటక కేంద్రమైన అరకులోయకు 38 కి.మీ. దూరంలో ఉన్నాయి. సముద్ర మట్టానికి 1,400 మీటర్ల ఎత్తున ఉన్నాయి. దేశంలోని అతి పెద్ద గుహల్లో ఇవి ఉన్నాయి. వీటిని చూడాలంటే బొర్రా రైల్వే స్టేషన్‌లో దిగి కిలోమీటరు ప్రయాణం చేయాలి. దీని కోసం జీపులు, ఆటోలు ఉంటాయి.



బొర్రా గుహలు బయట చేపట్టే అభివృద్ధి నమూనా

5.89 ఎకరాల్లో అభివృద్ధి పనులు

బొర్రా గుహలకు రోజూ వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. కానీ వారికి సరైన ప్రయాణ, పార్కింగ్, వసతి సౌకర్యాలు లేవు. ఈ నేపథ్యంలో 5.89 ఎకరాల్లో రూ.24 కోట్లతో సౌకర్యాలు సమకూర్చాలని ఏపీటీడీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో అచ్చంగా రెండు ఎకరాల స్థలాన్ని పార్కింగ్‌కు కేటాయించారు. అలాగే బొర్రా గుహలకు వెళ్లే మార్గంలో అందమైన ద్వారం, గుహల వద్ద మరో ద్వారం నిర్మిస్తారు. ఆ ప్రాంతం వాహనాల పొగతో కాలుష్యమయం కాకుండా ఎలక్ట్రిక్ వాహనాలను నడుపుతారు. వాటి ద్వారా పర్యాటకులను గుహలకు తీసుకువెళ్లి తీసుకువస్తారు. పర్యాటకుల కోసం టాయిలెట్లు, లగేజీ భద్రపరుచుకునే గదులు, తాగునీటి సౌకర్యం కల్పిస్తారు.

ప్రత్యేకంగా మార్కెట్ స్ట్రీట్

బొర్రా గుహల ముందు గిరిజనులు తయారుచేసిన, పండించిన వాటిని విక్రయిస్తున్నారు. దీనిని మార్కెట్ స్ట్రీట్‌గా అభివృద్ధి చేస్తారు. రెండు వైపులా ఫుట్‌పాత్‌లు నిర్మిస్తారు. పర్యాటకులు పక్కనే ఉన్న లోయ అందాలను తిలకించేందుకు వ్యూపాయింట్లు, విజువల్ డెక్ ఏర్పాటుచేస్తారు. సిటింగ్ ఏరియా ఉంటుంది. అడ్వెంచర్ స్పోర్ట్స్, ఎగ్జిబిషన్ వంటివి పెడతారు.

విజటర్స్ కౌంటర్

పర్యాటకుల వసతి కోసం రెండు అంతస్థుల భవనం నిర్మిస్తారు. ఇక్కడే టికెట్లు, బ్యాగేజీ, రెస్టారెంట్ వంటి సౌకర్యాలు ఉంటాయి. ఇక గుహల లోపల అవసరమైన ప్రాంతాల్లో స్టెయిర్ కేసులు, రెయిలింగ్‌లు ... మిగతా 8వ పేజీలో



ఏరియా ఆస్పత్రిలో చింతలూరు అతిసార బాధితురాలిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

మాతా, శిశు మరణాల నియంత్రణకు చర్యలు

- పీహెచ్‌సీ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలు
- డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

చింతపల్లి, సెప్టెంబరు 14: గిరిజన గ్రామాల్లో మాతా, శిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ జమాల్ బాషా అన్నారు. శనివారం మండలంలోని చింతలూరు గ్రామం, ఏరియా ఆస్పత్రి, గర్భిణుల వసతి గృహం లోతుగెడ్డ పీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో విలేకరులతో మాట్లాడుతూ మాతా, శిశు మరణాలు సంభవించకుండా పీహెచ్‌సీ వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. ప్రతి గర్భిణి ఆస్పత్రిలో ప్రసవం పొందేలా ప్రోత్సహించాలని ఆదేశించామన్నారు. గర్భిణులకు ఏరియా ఆస్పత్రుల్లో అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు నిర్వహించి, ప్రమాదకర ప్రసవాలను ముందుగా గుర్తించాలని సూచించారు. గర్భిణి ప్రసవానికి 15 రోజులు ముందుగా ఆస్పత్రిలో చేరాలన్నారు. వాతావరణంలో కలిగిన మార్పులతో గిరిజన గ్రామాల్లో జ్వరాలు, అతిసార, వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని వైద్యులను ఆదేశించామన్నారు. లంబసింగి, తాజంగి పీహెచ్‌సీ పరిధిలో సీరియస్ రోగులను నేరుగా నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, కేజీహెచ్‌కి తరలించాలని సూచించామన్నారు. ఏరియా ఆస్పత్రిలో రోగులను తరలించేందుకు అత్యవసర పరిస్థితుల్లో పీహెచ్‌సీ అంబులెన్సులను ఉపయోగించుకోవచ్చునన్నారు.

చింతలూరులో అదుపులో అతిసార

చింతలూరు గ్రామంలో అతిసార అదుపులోకి వచ్చిందని డీఎంహెచ్‌వో జమాల్ బాషా అన్నారు. గ్రామంలో అతిసార బాధితులు పూర్తిగా కోలుకున్నారని, ఒక మహిళ చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుందన్నారు. గ్రామంలో ఆదివాసీలు నిల్వ చేపలు కొనుగోలు చేసుకుని తినడం, నాటు సారా తాగడం వల్ల అతిసార ప్రబలినట్టు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ప్రజలు నిల్వ మాంసాన్ని ఆహారంగా తీసుకోరాదన్నారు. ఆయన వెంట ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ జి. ప్రభావతి, లంబసింగి, లోతుగెడ్డ వైద్యాధికారులు దినేశ్, జానకి, ఆరోగ్య విస్తరణ అధికారి సింహాద్రి ఉన్నారు.

నిమ్మచెట్టుకు అధికారులు

- కొండ చరియలు, భారీ చెట్లు, ఇళ్లలోని బురదను పరిశీలించిన సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్
- మేటలు వేసిన వరి పొలాలు, కొట్టుకుపోయిన వంతెనలు పరిశీలన
- అధికారులను పంపించి నష్టాన్ని అంచనా వేయిస్తామని సబ్‌కలెక్టర్ హామీ
- ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ పంచాయతీల్లో మండల అధికారులు నష్టాల వివరాలు సేకరణ



నిమ్మచెట్టు గ్రామంలో వరద నష్టాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్

సీలేరు, సెప్టెంబరు 14: జీకేవీధి మండలం ధారకొండ, గుమ్మిరేవుల పంచాయతీల్లో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో 'నిమ్మచెట్టు మరో చత్రాపల్లి' శీర్షికన వచ్చిన కథనానికి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలతో సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ధారకొండ పంచాయతీ నిమ్మచెట్టు గ్రామానికి చేరుకుని ఈనెల 1వ తేదీ రాత్రి కొండలపై నుంచి గ్రామంలోకి కొట్టుకు వచ్చిన కొండచరియలు, చెట్లు, ఇళ్లలోకి కొట్టుకు వచ్చిన బురదను పరిశీలించారు. గ్రామంలో వేసిన వరి పంట పూర్తిగా పోయిందని, విరిగిపడిన కొండచరియలు, మట్టి, బురద పొలాల్లో మోకాలు లోతు వరకు చేరిందని నిమ్మచెట్టు గిరి రైతులు వాపోయారు. అలాగే పంట పొలాల్లో పేరుకుపోయిన బురద, కొండచరియలు, చెట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు సబ్ కలెక్టర్‌ను కోరారు. ఇక్కడ వర్షానికి వాటిల్లిన నష్టాన్ని ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులందరికీ న్యాయం చేస్తామని సబ్‌కలెక్టర్ హామీ ఇచ్చారు. ఆయా శాఖల అధికారులను పంపించి పంట నష్టం, ఇతర నష్టాలను అంచనా వేయించి, పరిహారం వచ్చేలా చర్యలు చేపడతామని నిమ్మచెట్టు గిరిజనులకు శౌర్యమన్ పటేల్ హామీ ఇచ్చారు. అనంతరం వర్షాలకు దెబ్బతిన్న గంగవరం, అగ్రహారం వంతెలను పరిశీలించారు. తర్వాత గుమ్మిరేవుల పంచాయతీ పరిధిలోని చోడిరాయిలో కోతకు గురైన వంతెనను పరిశీలించారు. చోడిరాయి, పేట్రాయి వంతెనలు వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో గుమ్మరేవులు, ధారకొండ పంచాయతీల్లో 60 గ్రామాలకుపైగా రాజమహేంద్రవరానికి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. తాము నిత్యావసర సరకులు, అత్యవసర రోగులను తరలించడానికి ఈ వంతెనలు ఎంతో అవసరమని గిరిజనులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, తాగు నీటి సమస్య అధికంగా ఉందని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి కమ్మరితోట చేరుకుని వరద తాకిడికి కొట్టుకుపోయిన వరి పొలాలను పరిశీలించారు. సంబంధిత అధికారులను పంపించి నష్టాలపై అంచనాలు వేయించి త్వరితగతిన బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు చేపడతామని సబ్ కలెక్టర్ గిరిజనులకు హామీ ఇచ్చారు. అలాగే రెండు పంచాయతీల్లో దెబ్బతిన్న వంతెన పునరుద్ధరణ పనులు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ పేర్కొన్నారు. ఆయన వెంట ధారకొండ సర్పంచ్ నడిగట్ల రాజు, ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు సుంకరి విష్ణుమూర్తి, కూటమి నాయకులు పోతురాజు కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు పోతురాజు మల్లుదొర, చంద్రకళ, గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ తదితర్లు ఉన్నారు.

మండల అధికారుల బృందం పంట నష్టం అంచనా

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ పంచాయతీల్లో వాయుగుండం వర్షాలతో ఏర్పడిన పంటలు, ఇతర నష్టాలను మండల అధికారులు శనివారం పరిశీలించారు. నిమ్మచెట్టు, దార్లగొంది, గంగవరం, అగ్రహారం, చోడిరాయి, మాదిమల్లు, మునసలవీధి, కమ్మరితోట గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో వాటిల్లిన పంటలు, ఇళ్లు, రోడ్లు, వంతెనలు, విద్యుత్, పెంపుడు జంతువులకు వాటిల్లిన నష్టాలను పరిశీలించారు. వరి పొలాల్లో పేరుకుపోయిన బురద, ఇళ్లలోకి వచ్చిన బురదలను పరిశీలించారు. ఈ గ్రామాల్లో జరిగిన నష్టంపై నివేదికను జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీఏ అభిషేక్‌లకు అందజేస్తామని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. నష్టాన్ని అంచనా వేసిన వారిలో ఈవోపీఆర్‌డీ పాపారావు, మండల వ్యవసాయాధికారి టి మధుసూదనరావు, ఏఈ (ప్రాజెక్టు) జీవీఎస్ ప్రకాష్, కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటరావు ఉన్నారు.

సరియా జలపాతం వద్ద ఇద్దరి గల్లంతు

అనంతగిరి మండలంలో గల సరియా జలపాతంలో శనివారం సాయంత్రం ఇద్దరు పర్యాటకులు గల్లంతయ్యారు.



← గల్లంతైన సాయికుమార్ (ఫైల్ ఫొటో)

-వివరాలు మెయిన్ ఎడిషన్‌లో..



పాడేరు అంబేడ్కర్ సెంటర్‌లో జల్లులు కురిసిన దృశ్యం

మన్యంలో ముసురు వాతావరణం

పాడేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బంగా ప్రాంతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో శనివారం సాయంత్రం నుంచి మన్యంలో ముసురు వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సాధారణ వాతావరణంతో ఎండ కాసింది. ఆ తర్వాత నుంచి వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమై జల్లులతో కూడిన వర్షం మొదలైంది. వాతావరణం శాఖ సూచనలతో ఆదివారం ఒక మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

శ్రీమతికి ఓ ప్రశంస



- భార్యను ప్రశంసించడమూ ముఖ్యమే
- కుటుంబం సాఫీగా సాగడంలో కీలక భూమిక ఆమెదే
- ఉదయం నుంచి రాత్రి వరకూ తీవ్రంగా శ్రమించే వ్యక్తి
- తగిన గుర్తింపు, గౌరవం దక్కకపోవడంతో అనేక ఇబ్బందులు
- నేడు భార్యను ప్రశంసించే రోజు సందర్భంగా...

ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. అటువంటి ఇల్లాలి కష్టాన్ని గుర్తించే పనిని అతి తక్కువ మంది మాత్రమే చేస్తుంటారు. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునేంత వరకు కుటుంబం కోసం అవిశ్రాంతంగా శ్రమించే భార్య చేసే పనిని గుర్తించకపోవడం వల్ల అనేక కుటుంబాల్లో వివాదాలు తలెత్తుతున్నాయి. కొంతమంది మ హిళలు మానసికంగా తీవ్ర వేదనకు, ఒత్తిడికి గురై అనారోగ్యానికి గురవుతున్నారని పలు పరిశోధనలు చెబుతున్నాయి. కుటుంబ నావను సాఫీగా నడిపించడంలో కీలకంగా వ్యవహరించే భార్యను గుర్తించడం, గౌరవించడం ద్వారా ఆనందకరమైన జీవితాన్ని సాగించేందుకు అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఉద్దేశంతోనే ఏటా సెప్టెంబరు మూడో ఆదివారం భార్యను ప్రశంసించే రోజుగా నిర్వహిస్తూ వస్తున్నారు. గడిచిన కొన్నాళ్లుగా ఈ రోజును ప్రపంచంలోని అనేక దేశాల్లో నిర్వహిస్తున్నప్పటికీ..చాలా మందికి దీనిపై అవగాహన కూడా లేదు. నేడు భార్యను ప్రశంసించే (అభినందించే) రోజు సందర్భంగా అందిస్తున్న ప్రత్యేక కథనం 7వ పేజీలో...

క్రైం... crime news

మోతాదుకు మించి మాత్రలు మింగిన వృద్ధుడి మృతి

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 14 : విశాఖ కేజీహెచ్‌లో ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పట్టణ ఏఎస్‌ఐ నూకరాజు శనివారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. ఇక్కడి గవరపాలెంలోని శాంతినగర్‌కు చెందిన కొణతాల మంగ జగ్గారావు (74) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యుల సలహా మేరకు రాత్రి వేళ నిద్ర మాత్ర వేసుకుంటున్నాడు. ఈ నెల 12వ తేదీన వైద్యులు సూచించిన ఒక మాత్రకు బదులు ఎక్కువ మాత్రలు మింగడం వల్ల అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్టు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడి కుమారు జగదీష్‌కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పాము కాటుతో యువకుడి మృతి


మృతి చెందిన శివ

నక్కపల్లి, సెప్టెంబరు 14 : మండలంలో ఓ యువకుడు పాముకాటుకు గురై మృతి చెందినట్టు నక్కపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకట్రావ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. డొంకాడకు చెందిన సకిరెడ్డి శివ (30) శుక్రవారం రాత్రి పొలానికి వెళ్లినప్పుడు అక్కడ పాము కాటు వేసింది. ఇంటికి వస్తూ మార్గమధ్యలో అతడు స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు తుని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి కాకినాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్టు హెచ్‌సీ తెలిపారు. ఈ ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

పాయకరావుపేట, సెప్టెంబరు 14 : రైలులో ప్రయాణిస్తూ గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. విశాఖ నుంచి విజయవాడ వైపు శనివారం ఉదయం వెళుతున్న రైలులో ప్రయాణిస్తున్న 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి పాయకరావుపేటలోని చెక్కానగర్ శివారులో ప్రమాదవశాత్తూ జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. నాచురంగుపై చిన్నచిన్న తెలుపు రంగు చుక్కలు కలిగిన ఆఫ్ చేతుల చొక్కా, లైట్ ఆకుపచ్చరంగు రన్నింగ్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుడి ఎడమ చేతిపై బెంగాలీలో పేరు పచ్చబొట్టుతో ఉంది తప్ప ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరుస్తామన్నారు. వివరాలు తెలిసిన వారుంటే తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు. హెచ్‌సీ జి.మోహనరావు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి


యశ్వంత్ (ఫైల్)

దేవరాపల్లి, సెప్టెంబరు 14 : ఫ్యాన్ వేసేందుకు స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ఓ బాలుడు మృత్యువాత పడిన విషాద ఘటన శనివారం మండలంలోని ములకాపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ములకాపల్లికి చెందిన వడగళ్ల యశ్వంత్ (10) ఇంట్లో ఫ్యాన్ వేసేందుకు స్విచ్ బోర్డులో ప్లగ్ పెడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే కుటుంబీకులు బయటకు తీసుకొచ్చి ఇసుకలో కప్పి బతికించడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అప్పటికే ప్రాణాలు విడిచాడు. అప్పటివరకూ తమ కళ్ల ఎదుటే ఆడిపాడిన కుమారుడు విద్యుదాఘాతానికి గురై విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు గణేశ్, భవానీ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా, గణేష్ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హేమంత్, చిన్నకుమారుడు యశ్వంత్. విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడా పోటీలకు పక్కా ఏర్పాట్లు

▸▸ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు


క్రీడా పోటీలపై సమీక్షిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 14 : విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా క్రీడా పోటీలకు పక్కా ఏర్పాట్లు చేయాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఎంఈవోలను ఆదేశించారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరగనున్న క్రీడా పోటీలకు సంబంధించి నాలుగు మండలాల ఎంఈవోలతో శనివారం స్పీకర్ అయ్యన్న సమన్వయ సమావేశం నిర్వహించారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలబాలికలకు సీనియర్స్, జూనియర్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయని ఎంఈవోలు తెలిపారు. గెలుపొందిన వారిని జిల్లా స్థాయికి పంపడం జరుగుతుందని అన్నారు. పోటీలలో పాల్గొనేందుకు వచ్చే నాలుగు మండలాల నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా, భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని స్పీకర్ ఆదేశించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, వాటర్ బాటిల్స్, అల్పాహారం తాను ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు తలుపులు, నాగేంద్ర, జాన్ ప్రసాద్, సత్యనారాయణ, క్రీడా సమన్వయ కర్త శ్రీనివాసులవాసులు నాయుడు పాల్గొన్నారు.

30 నుంచి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు

▸▸ డిసెంబరు 30న తుది జాబితా విడుదల

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 30వ తేదీ నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ మొదలు కానున్నది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 25వ తేదీతో ముగియనున్నది. ఈలోగా ఓటర్ల జాబితా కోసం ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, తుది జాబితా కోసం ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఖరారు చేసింది. ఓటర్ల నమోదుకు సంబంధించి ఈనెల 30న షెడ్యూల్-1 విడుదల చేయనున్నారు. అదే రోజు నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుడతారు. ఓటర్ల నమోదు పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియలో చేపడతారు. ఓటర్ల నమోదుకు నవంబరు ఆరో తేదీ వరకు గడువు ఇచ్చారు. నవంబరు 23న ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేసి అదే రోజు నుంచి డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. అభ్యంతరాలను డిసెంబరు 25లోగా పరిష్కరించి తుది జాబితాను డిసెంబరు 25న విడుదల చేస్తారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ప్రతి ఎన్నికలకు ముందు ఓటరు విధిగా పేరు నమోదు చేసుకోవాలి. టీచర్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు కావాలంటే స్కూల్ అసిస్టెంట్ నుంచి విశ్వవిద్యాలయం ఆచార్యుడు వరకు ప్రతిఒక్కరూ అర్హులే. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే టీచర్లు/అధ్యాపకులు/ఆచార్యులకు సంబంధిత విభాగాల అధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుంది.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	97.00
లైవ్ ధర	117.00
విత్ స్కిన్	204.00
స్కిన్ లెస్	214.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

శ్రీమతికి ఓ ప్రశంస

ఆరోగ్యం ఎలా ఉంది.. భోజనం చేశావా.. భర్తలు చూపే ఇటువంటి ఆప్యాయ పలకరింపులు, మాటలే భార్యలకు కొండంత భరోసాను కలిగిస్తాయి. ఇల్లాలు గుణవంతురాలు, పనివంతురాలు అయితే ఆ కుటుంబం జీవన యానం సజావుగా సాగుతుంది. కుటుంబ వ్యవస్థలో భార్య పాత్ర ఎనలేనిది.. వెలకట్ట లేనిది.. ఆమె లేని కుటుంబం నడి సముద్రంలో నావ వంటిది. అది ఎటుపోతుందో ఎవరికీ అంతుపట్టదు. కానీ భార్యను కనీసం గుర్తించేందుకు కూడా కొంతమంది భర్తలు ఇష్టపడరు. ఆమె త్యాగాన్ని, శ్రమించే తీరును ప్రతిరోజూ కాకపోయినా కనీసం ఏడాదిలో ఒక్కసారైనా గుర్తించేందుకే ఏటా సెప్టెంబరు మూడో ఆదివారం భార్యను ప్రశంసించే దినోత్సవం నిర్వహిస్తున్నారు. నేడు భార్యను ప్రశంసే దినోత్సవం సందర్భంగా ఈ కథనం..

- విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

భార్య యోగ క్షేమాలు తెలుసుకోవడం భర్త కనీస బాధ్యత.

కుటుంబ నావ సాఫీగా సాగడంలో అతివలది కీలక పాత్ర

ఉదయం లేచిన నుంచి రాత్రి పడుకునే వరకు తీవ్రమైన ఒత్తిడి

▸▸ తగిన గుర్తింపు, గౌరవం దక్కకపోవడంతో మనో వేదన

▸▸ ఆప్యాయత పలకరింపుతోనే ఆమెకు కొండంత ధైర్యం

నేడు భార్యను ప్రశంసించే రోజు



ఆ భావన తప్పు..

వంట చేయడం, అంట్లు తోమడం, పిల్లలను చూసుకోవడం వంటి పనులన్నీ ఆడవాళ్లు మాత్రమే చేయాలన్న భావన పెరిగిపోయింది. ఈ భావనతోనే భార్య ఎంత కష్టపడి పని చేసినా గుర్తింపు దక్కడం లేదు. ఆ భావన తప్పు అని నిపుణులు చెబుతున్నారు. భర్త కుటుంబం కోసం బయట ఎంత కష్టపడుతుంటాడో అంతకు రెట్టించిన కష్టాన్ని భార్య పడుతుంది. ఆ కష్టాన్ని కనీసం గుర్తించడం ద్వారా వారికి గుర్తింపును ఇచ్చినట్టు అవుతుంది. ఈ గుర్తింపు లేకపోతే కుటుంబంలో అనేక వివాదాలు చెలరేగుతాయి.



తీవ్రమైన ఒత్తిడికి గురయ్యే ప్రమాదం..

చాలామంది మహిళలు ఇంట్లో పని చేస్తూనే, బయట కూడా ఉద్యోగాలు చేస్తుంటారు. వీరు తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. వృత్తిపరమైన ఒత్తిడితోపాటు ఇంట్లో పనులు చేయలేక ఒత్తిడికి గురయ్యే భార్యల పట్ల మరింత సానుకూలంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే వారు తీవ్రమైన డిప్రెషన్ బారినపడే అవకాశం ఉంది. భర్త కోసం ఎంత చేసినా పట్టించుకోనట్టు వ్యవహరించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా తాను ఎంత చేసినా ప్రయోజనం లేకుండా పోతోందన్న భావనతో తీవ్రమైన నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయే ప్రమాదం ఉంది. దీనివల్ల ఒత్తిడి, డిప్రెషన్, వైవాహిక జీవితంలో గొడవలకు అవకాశం ఉంటుంది. ఇంట్లో లభించని ఆ గుర్తింపు, గౌరవాన్ని బయట కోరుకునే ప్రమాదం కూడా ఉంది. ఆ కోరిక వివాహేతర సంబంధాలకు దారి తీసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఇలా చేయడం మేలు..

ప్రతిరోజూ భార్యను ప్రశంసించడం చాలా మందికి సాధ్యపడకపోవచ్చు. కనీసం ఏడాదిలో ఒక్కరోజైనా భార్యతో ప్రత్యేకంగా గడిపేలా చేసేందుకు ఈ రోజును నిర్వహిస్తున్నారు. భార్యను ప్రశంసించే రోజు ఇంట్లో పనికి భార్యను పూర్తిగా దూరంగా ఉంచాలి. వీలైతే భర్తే ఆమెకు నచ్చిన వంటలు చేసి పెట్టాలి. నచ్చిన ప్లేస్‌కు తీసుకెళ్లి సర్‌ప్రైజ్ చేయాలి. పిల్లలు, ఇతర కుటుంబ సభ్యులకు దూరంగా భార్య, భర్త ఇద్దరు మాత్రమే ఆ రోజంతా గడిపేలా ప్లాన్ చేసుకోవాలి. దీనివల్ల అప్పటివరకు ఇద్దరి మధ్య ఉన్న చిన్నపాటి ఇబ్బందులు తొలగిపోతాయి. ఆ రోజు ఆమె చేసే ప్రతి పనిని అభినందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి.

మహిళల్లో పెరుగుతున్న నిరాశ, నిస్పృహలు

- డాక్టర్ పూజిత జోస్యుల, మానసిక నిపుణులు



ప్రతి భార్య తాను చేసే పనికి గుర్తింపును కోరుకుంటుంది. అనేక కుటుంబాల్లో భార్యకు తగిన గుర్తింపు లభించకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. భార్య, భర్తల మధ్య గొడవలకు ప్రధాన కారణం కూడా అదే. ఇంట్లో ఎంత పని చేసినా కనీసం పట్టించుకోవడం లేదని భార్యలు చెబుతున్నారు. ఎంత కష్టపడినా గుర్తింపు లేని చోట ఎందుకు ఉండాలన్న భావన చాలామంది మహిళల్లో పెరుగుతోంది. భార్య చేసే పనిని గుర్తించడం, గౌరవించడం కనీస బాధ్యతగా భర్త గుర్తించాలి. ముఖ్యంగా భార్యను ఎప్పటిప్పుడు బయటకు తీసుకెళ్లడం, ఇటువంటి ప్రత్యేక రోజుల్లో గిఫ్టులు, ఇష్టమైన వస్తువులు ఇవ్వడం ద్వారా వారిలో పెరుగు తున్న నిరాశ, నిస్పృహ, ఒత్తిడి వంటి సమస్యలకు చెక్ చెప్పేందుకు అవకాశం ఉంటుంది.



ఏమని ప్రశంసించాలి..

ప్రశంస అంటే భార్యపై పొగడ్తల వర్షం కురిపించడం కాదు. ప్రేమ పూర్వకంగా వ్యవహరిస్తూ ఆమె చేసే పనిని అభినందించడం. ఈ పని ప్రతిరోజూ చేసేందుకు అవకాశం ఉంటుంది. కానీ, ఉరుకులు, పరుగులు జీవితం, ఒత్తిడితో కూడిన ఉద్యోగాలు, భార్య చేయాల్సిన పని కాబట్టి ప్రత్యేకంగా ఎందుకు అభినందించాలన్న భావన. ఈ ప్రశంసకు భార్యలను దూరం చేస్తుంది. ప్రతి సందర్భంలోనూ భార్య ఉత్సాహంగా పని చేసేలా చేసే అవకాశం భర్తకు ఉంటుంది. ఉదాహరణకు టీ ఇచ్చినప్పుడు చాలా బాగుందని చెప్పడం ద్వారా ఆమె ఎంతగానో ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది. చీర/డ్రెస్ కొత్తది కట్టుకున్నప్పుడు ఇందులో చాలా అందంగా ఉన్నావు అని భర్త చెప్పే మాట ఆమెకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుంది. ఏదైనా ప్రత్యేక వంటకం చేసినప్పుడు, ప్రత్యేక సందర్భాల్లో ఇలా చిన్నపాటి పొగడ్త ఆమె మరింత ఉత్సాహంగా పని చేసేందుకు దోహదం చేస్తుంది. దీని వల్ల భార్యాభర్తల వైవాహిక జీవితం కూడా ఆనందంగా సాగుతుంది.

నేవీ ప్రహరీ నిర్మాణంపై నిరసన

▸▸ నేవీ అధికారుల చర్యలపై గ్రామస్థులు ఆగ్రహం

▸▸ ముఖద్వారం వద్ద అంతా బైఠాయింపు

▸▸ వాహనాలు రాకుండా రోడ్డుపై కంచె వేసి నినాదాలు

▸▸ ఆర్డీవో, తహసీల్దార్, డీఎస్పీ, సీఐ రాక

▸▸ సమస్యలను వివరించిన పెద్దలు, గ్రామస్థులు

▸▸ అధికారుల సమాధానంతో ఆందోళన విరమణ


నిరసన తెలుపుతున్న గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న అధికారులు

రాంబిల్లి, సెప్టెంబరు 14 : గ్రామస్థులకు జీవనాధారమైన.., గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ నేవీ అధికారులు డీఆర్‌డీవో ద్వారా ప్రహరీ గోడ నిర్మిస్తుండడం వల్ల అన్ని విధాలా నష్టపోతున్నామని ఆరోపిస్తూ మండలంలోని వై.లోవ గ్రామస్థులు శనివారం ఆందోళనకు దిగారు. గ్రామ సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు బద్ది నారాయణరావు, బి.నారాయణరావుల ఆధ్వర్యంలో గ్రామ ముఖద్వారం వద్ద గల ప్రధాన రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గ్రామంలోకి ఏ వాహనం రాకుండా రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె వేశారు. కలెక్టర్ వచ్చి తమ సమస్యలు పరిష్కరించాలని, ఆ తరువాతే నేవీ గోడ నిర్మాణం చేపట్టాలని నినాదాలు చేశారు. ముందుగా విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు వి.దినబాబు, పప్పల నూకన్నదొర గ్రామానికి విచ్చేసి ఆందోళనకారులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ, రాంబిల్లి తహసీల్దార్ పి.భాగ్యవతి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, రాంబిల్లి సీఐ నర్సింగరావులు సంఘటనా స్థలానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వారితో సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ పూర్వకాలం నుంచి గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలతో పాడి, కూలిపనులు చేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ కొండ మీదే పశువుల పాకలు ఏర్పాటు చేసుకొని పశులను మేపుకుంటున్నట్టు చెప్పారు. ఉపాధి పనులు కూడా ఈ కొండమీదే చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని వివరించారు. గ్రామాన్ని ఆనుకొని ఉన్న శానదా నది పొంగి ప్రవహించినప్పుడు నదిలో నీరు గ్రామంలోకి చేరుతుందన్నారు. అటువంటి సమయంలో తమ గ్రామానికి ఈ కొండ రక్షణగా ఉంటుందని వివరించారు. నేవీ అధికారులు గ్రామస్థులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తున్నట్టు ఆరోపించారు. ఈ కారణంగా ఏడాది కాలంగా గ్రామస్థులమంతా ఉపాధితో పాటు, అన్నివిధాలా నష్టపోయామని వారు వాపోయారు. గ్రామంలో అర ఎకరం భూమిని శ్మశానవాటికకు కేటాయించాలని, గ్రామంలోని ఇళ్ల వద్ద నుంచి 10 అడుగుల దూరంలో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టుకోవాలని, గ్రామానికి ఇబ్బందులు లేకుండా పనులు చేయాలని, గ్రామస్థులకు ఉపాధి కల్పించాలని, గ్రామ పెద్దలపై అటవీ అధికారులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని, ఏడాది కాలంగా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని వారు అధికారులను కోరారు. వీటిపై ఆర్డీవో చిన్నికృష్ణ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని అభివృద్ధి చేసుకునేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని వారికి తెలిపారు.

అలాగే వేరొక చోట కూడా మరికొంత శ్మశానవాటికకు స్థలం ఏర్పాటు చేస్తామన్నారు. ఉపాధి విషయమై జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తానన్నారు. గ్రామ పెద్దలపై అటవీ అధికారులు పెట్టిన కేసుల అంశాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళతానన్నారు. గ్రామంలోని ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గతంలో రెవెన్యూ శాఖ నిర్వహించిన సర్వే ఆధారంగా ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ పర్యవేక్షణలో నేవీ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే, కలెక్టర్‌తో మాట్లాడి తమ పరిధిలో ఉన్న సమస్యలను త్వరగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వారికి హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళనను విరమించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని గ్రామ సమస్యలు పరిష్కరించేలా చూడాలని, లేనిపక్షంలో గ్రామస్థులమంతా కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. వీరి ఆందోళనకు సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదకలవలాపల్లి మాజీ సర్పంచ్ కర్రి సింహగిరి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రావి దేముళ్ళు, చిన కలవలాపల్లి సర్పంచ్ వై.శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఇకపై ఒక్కరే ఎంఈవో?

ప్రభుత్వ నిర్ణయం... డీఈవోలకు సమాచారం

▸▸ గత ప్రభుత్వం తీసుకువచ్చిన మండలానికి ఇద్దరు ఎంఈవోల విధానానికి స్వస్తి

▸▸ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు

విశాఖపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలానికి ఇద్దరు విద్యాశాఖాధికారుల విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనున్నట్టు తెలిసింది. గతంలో మాదిరిగా ఎంఈవో ఒక్కరే ఉంటారు. అయితే పాఠశాలల్లో విద్యా బోధనను పర్యవేక్షించడానికి స్కూల్ కాంప్లెక్స్‌ల వ్యవస్థను పటిష్ఠం చేసి, అక్కడ హెచ్‌ఎంకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారు.

గతంలో మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. విద్యాబోధన, టీచర్ల సర్వీస్ వ్యవహారాలు, ప్రభుత్వ పథకాలు అమలు తీరును పర్యవేక్షించేవారు. అయితే ఎంఈవోకు పనిభారం ఎక్కువగా ఉందని భావించిన గత పాలకులు ప్రతి మండలానికి రెండో ఎంఈవో పోస్టును కేటాయించారు. ఎంఈవో-1గా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు, ఎంఈవో-2గా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలలో సీనియర్లకు అవకాశం కల్పించారు. మండలంలో పాఠశాలల పర్యవేక్షణ కంటే ఇరువురు ఎంఈవోల మధ్య ఆధిపత్య పోరే ఎక్కువగా ఉండేది. ప్రైవేటు స్కూళ్లు ఎక్కువగా ఉన్న విశాఖ జిల్లాలో వాటి గుర్తింపు వ్యవహారంలో ఎంఈవోల మధ్య కొన్నాళ్లు ప్రచ్ఛన్న యుద్ధం జరిగింది. చివరకు కొంతమంది చొరవతో ప్రైవేటు పాఠశాలలను ఇద్దరు చెరో సగం పంచుకుని భారీగా వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇద్దరు ఎంఈవోల మధ్య వివాదాలు ఎక్కువగా ఉండడంతో కొత్త ప్రభుత్వం మండలానికి ఒకరిని మాత్రమే ఉంచాలని సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చింది. ఇప్పటికే ఈ విషయమై జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం వచ్చింది. ఒక్క ఎంఈవోనే కొనసాగించనున్న నేపథ్యంలో విద్యా బోధన, పాఠశాలలపై పర్యవేక్షణ బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించనున్నారు. విశాఖ జిల్లాలో 543 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, 54 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. రమారమి పది వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అందుబాటులో ఉంటూ అన్ని సదుపాయాలున్న ఉన్నత పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్‌గా పరిగణిస్తుంటారు. తాజా నిర్ణయంతో స్కూల్ కాంప్లెక్స్‌ల సంఖ్య స్వల్పంగా తగ్గుతుందని చెబుతున్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్ బాధ్యత అందుబాటులో ఉన్న ఉన్నత పాఠశాలకు అప్పగించనున్నారు. ప్రధానోపాధ్యాయ పోస్టు లేని బోని స్కూలు కాంప్లెక్స్‌ను గొట్టిపల్లిలో, గండిగుండంను గిడిజాలలో కలుపుతున్నారు. స్కూలు కాంప్లెక్స్ పరిధిలో 35 నుంచి 87 ఎస్జీటీ టీచర్లు ఉండేలా మార్పులు చేస్తున్నారు. తాజా నిర్ణయంతో స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఎక్కువ అధికారాలు అప్పగిస్తున్నారు. ఎస్జీటీలకు సంబంధించి సర్వీస్ వ్యవహారాలు, సెలవులు మంజూరు అధికారాలు కట్టబెడతారు. ఇక ఎంఈవోలను పాఠశాలల తనిఖీ బాధ్యతల వరకే పరిమితం చేయనున్నారు.

సీఎం, ఎక్సైజ్ శాఖా మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

కొత్తూరు, సెప్టెంబర్ 14 : రాష్ట్రంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను ఏకీకరణ చేసిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు శనివారం అనకాపల్లిలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో సిబ్బంది పాలాభిషేకం చేశారు. సీఐ శేషుకుమారి ముఖ్య అతిథిగా హాజరై వారి చిత్రపటాలపై పాలు పోసి అభిషేకించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉన్న ఎక్సైజ్ శాఖను వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్‌ఈబీగా విభజించిందన్నారు. 70శాతం ఎస్‌ఈబీ గాను, 30శాతం ఎక్సైజ్ శాఖగాను పరిగణించి సిబ్బందిని విభజించారని పేర్కొన్నారు. తమ అభిప్రాయం లేకుండా ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని వాపోయారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖా మంత్రికి వివరించడంతో వారు స్పందించి ఏకీకరణ శాఖగా ప్రకటించారని వారంతా హర్షం వ్యక్తం చేశారు.

రేపటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

అనకాపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ఫిర్యాదుల స్వీకరణ) కార్యక్రమాన్ని ఈ సోమవారం ఈద్‌ఈ మిలాద్ ఉన్ నబీ పర్వదినం సందర్భంగా రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం రద్దు కావడంతో ఆ రోజు అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గ్రహించి సోమవారం కలెక్టరేట్‌కు వివిధ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు రావద్దని ఆమె కోరారు.

CLASSIFIEDS

NURSERY

★ Ecofriends Nursery available all fruit, Indoor, Avenue, Outdoor Plants, Land Scaping, Rented Plants for Functions. Cont.: 9246627567, 9246651236
AJV_204556

EDUCATION

★ Online Degree, BBA, MBA, MCA, BTech, MTech, Diploma, Paramedical, BHM, MSW etc courses admissions. Low fees and Pass guidance provided. Ph:7997296796
AJV_192599

FLATS & VUDA PLOTS FOR SALE

★ ఆనందపురం నుండి తగరపువలస పోవు హైవేకి దగ్గర్లో 950 sft. & భీమిలి కృష్ణాకోలనీలో 850 sft., 1000 sft. Flats & Vuda Plots కలవు. సంప్ర॥ 9989434366, 9866950464
AJV_183195

FLATS FOR SALE

★ Free.. Free.. Free.. One year maintenance free with all amenities. 35L only. 2 BHK Flats for Sale at Gopalapatnam, Kothapalem. Brokers also invited. Cont.: 9391116732
AJV_192589

★ Ready to Occupy 2 BHK 1030 sft. Flats for Sale in Nature's Nest with quality construction, Near to Highway, Pollution's Free Zone, Semi Gated Community, Well Street Lighting, Beside Park & all these amenities have this project at Tagarapuvalasa. Cont.: 9866746418
AJV_192596

PLOT FOR SALE

★ విశాఖలో పరవాడ టు అచ్యుతాపురం రోడ్డు ఇరువాడ గ్రామం దగ్గరలో ఉడా లే అవుట్ గ॥ 7500/-లకే & అగనంపూడి దువ్వాడలో ప్లాట్లు / ఇండివిడ్యువల్ హౌస్‌లు కలవు. స్పాట్ రిజి॥ సంప్ర॥ 9490639799
AJV_192597

★ చినముషిడివాడ వుడా MIG-II, 167 చ॥గ॥ కూర్మన్నపాలెం, అశోక్‌నగర్-2 329 చ॥గ॥ కొత్తవలస రాయల్‌సిటీ, ఫేజ్-2, 180 చ॥గ॥ ప్లాట్స్ అమ్మకం కలవు. సంప్ర॥ 9291357365, 8712283650
AJV_192593

★ Vuda 538 sq.yds (269x2) West Facing, 50 ft. Road, Padmavati Nagar, Walkable to Vepagunta to Simhachalam 200 ft. BRTS Road. Cont.: 8309494629, 9885180930
AJV_204558

రియల్ ఎస్టేట్

➺ కంతేరు, కొప్పురావూరు, నంబూరు, కాజా, చిన్న కాకాని, గుంటూరు, గోరంట్ల, మంగళగిరిలో పొలాలు, ప్లాట్లు, అమ్మదలచిన, కొనదలచిన సంప్ర॥ దుర్గా రియల్ ఎస్టేట్ : 99664 17186
AJG_191827

FINANCE

గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కి, రిటైర్డ్ పెన్షనర్లకి సులభవాయిదాలలో ఫైనాన్స్ మరియు ఇళ్ళు, స్థలాలపైన బ్యాంకులోను ఉన్నా సరే సెకండ్ మార్టిగేజ్‌పై లోను 10లక్షల లోపు చెయ్యబడును. (సిబిల్ చూడబడదు) సెల్: 9666547338
AJH-186740

For Advertisement Contact : 9963231176 9966165093

WANTED TEACHERS
For PLAY SCHOOL 2 Nos. Experience in Play School Preferable Salary Negotiable
AB FUN CASTLE
Arena Mall, 4th Floor, Midhilapuri VUDA Colony, Madhurawada, VSP-41
9281412323

HOUSE FOR SALE

★ 3 BHK, 289 sq.yds. House for Sale at Madhavadhara, Visakhapatnam. Direct Parties only. Contact: 7981449781
AJV_192483

★ సుజాతనగర్ - చీమలాపల్లి మెయిన్‌రోడ్ దగ్గరలో 160, 125 చ॥గ॥ ఇండిపెండెంట్ ఇల్లులు అమ్మకం. లోన్ సౌకర్యం కలదు. & లంకెలపాలెం కొత్తూరు శిరసపల్లిలో 220 sq.yds. లో అపార్ట్‌మెంట్ ఫ్లాట్స్ లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో అమ్మకం. సంప్ర॥ 7207283618, 9392457090
AJV_192585

TO-LET (COMMERCIAL)

★ Tolet Commercial Space 900 sft. Main Road Facing, Chinamushidiwada. Contact: 9848257396
AJV_204555

TO-LET

★ 2 BHK 800 sft. Seethammapeta, Ground Floor, North Facing, No Car Parking, 2 Slots for 2 Wheeler Parking. Cont.: 8309659491
AJV_192482

LAND FOR SALE

★ రణస్థలం to నెల్లిమర్ల మెయిన్ రోడ్డుకి 1 కి.మీ. 2వ బిట్టు 33 సెంట్లు E/NF 30ft./20ft. Road Nr. AP మోడల్ జూనియర్ కాలేజ్ గవర్నమెంట్ హాస్పిటల్ & 2 రోడ్ కార్నర్. డెవలప్ ఏరియా. సంప్ర॥ 8309494629, 9885180930
AJV_204559

★ 2 ఎకరాల మామిడితోట పూర్తి ఫెన్సింగ్ / గేట్ బోర్‌వెల్ మోటార్‌తో 40 మామిడి చెట్లు, 15 నుండి 20 సం. వయస్సు గల 900 టేకు చెట్లు & డెయిరీ ఫామ్ 900 Sft. షెడ్ @ 1.80 లక్షలకు (per cent) అమ్మకం. కీర్దలో 70 సెంట్లు మామిడితోట సెంటు 1.20 లక్షలు. ఫోన్: 98483 72035.
AJV_204557

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

చాక్లెట్ గణపతికి పాలాభిషేకం



ముంచంగిపుట్టు, సెప్టెంబరు 14: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన చాక్లెట్ గణపతి ప్రతిమకు శనివారం పాలాభిషేకం చేశారు. అల్లూరి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చవితి ఉత్సవాలకు మండల కేంద్రానికి చెందిన కొమ్ము సాయికుమార్ అనే భక్తుడు సుమారు 30 కిలోల బరువు, మూడు అడుగుల పొడుగు ఉన్న చాక్లెట్ గణపతి ప్రతిమను అందించారు. నవరాత్రులు ముగియడంతో ఆ విగ్రహాన్ని ఉత్సవ కమిటీ సమక్షంలో సాయి కుమార్ కుటుంబ సభ్యులంతా పాలతో కరిగించారు. అనంతరం ప్రసాదంగా అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా విగ్రహ దాత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కృషిలో భాగంగా చాక్లెట్ గణపతి ప్రతిమను అందించినట్టు చెప్పారు. వచ్చే ఏడాది మరిన్ని చాక్లెక్‌తో పాటు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తామని చెప్పారు. కరగవేతను చూసేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కించుమండలో అన్నసమారాధన


డుంబ్రిగుడ, సెప్టెంబరు 14: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కించుమండ గ్రామంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. జీసీసీ ఉద్యోగి హరిబారికి, ధర్మ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు, అనంతరం సామాజిక నృత్యాలు చేస్తూ ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కించుమండ జనసేన యూత్ సభ్యులు చిన్న, దిలీప్, మోహన్ పాల్గొన్నారు.


నిత్యావసర సరకుల పంపిణీ


సీలేరు, సెప్టెంబరు 14: గూడెంకొత్తవీధి మండలంలోని గుమ్మిరేవుల పంచాయతీ మాదిమళ్ల గ్రామంలో ఎస్‌ఐ రామకృష్ణ శనివారం గిరిజనులకు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ఇటీవల ఈ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలిపోయి, సర్వం కోల్పోయిన గిరిజన కుటుంబాలకు బియ్యం, నూనె, కూరగాయలను ఎస్‌ఐ అందజేశారు.

ముంచంగిపుట్టులో భారీ వర్షం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 14: మండల పరిధిలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండకాసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి వాన పడింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పలు చోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. మట్టి రహదారుల రూపురేఖలు మారిపోయాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.







వంతెనలు శిథిలం.. రాకపోకలు కష్టం!

ఏజెన్సీలో కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల వంతెనలు శిథిలమయ్యాయి. గిరిజనులకు రాకపోకలు కష్టమవుతున్నాయి. గూడెంకొత్తవీధి మండలం ధారకొండ-గుమ్మిరేవుల మార్గంలో చోడిరాయి, మాదిమళ్లు వంతెనలు దెబ్బతిన్నాయి. అలాగే కొయ్యూరు మండలంలోని పాడి-రత్నంపేట గ్రామాల మధ్య కొండవాగు ప్రవాహంపై వంతెన శిథిలమయ్యాయి. దీంతో 75 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- పాడి-రత్నంపేట మార్గంలో కూలిన వంతెన
- 15 గ్రామాల ప్రజల నరకయాతన
- చోడిరాయి, మాదిమళ్లు వంతెనలు శిథిలం
- 60 గ్రామాల్లో రవాణాకు అంతరాయం
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు



పాడి-రత్నంపేట మార్గమధ్యంలో వరద నీటి ప్రవాహానికి శిథిలమైన వంతెన

కొయ్యూరు సెప్టెంబరు 14: కృష్ణాదేవీపేట నుంచి రత్నంపేట, పాడి మీదుగా కన్నంపేట గ్రామాన్ని కలిపే ప్రధాన రహదారి పరిధిలోని బాలారం, కంఠారం తదితర 15 గ్రామాల ప్రజలకు ఏ అవసరమైనా కృష్ణాదేవిపేట వచ్చేందుకు వినియోగించే రోడ్డు మధ్యలో వంతెన శిథిలమైంది. ఈ రహదారిలో పాడి దాటాక తాండవ రిజర్వాయర్ ఇన్‌ఫ్లో అయిన కొండకాలువ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పొంగి ప్రవహించడంతో ఈ దుస్థితి దాపురించింది. దీంతో కనీసం నడిచి రాకపోకలు సాగించేందుకు కూడా అవకాశం లేక ఆయా ప్రాంతాల ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో 15 గ్రామాల ప్రజలకు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఈ వంతెన గత ఏడాది కురిసిన వర్షాలకు కొద్దిపాటి శిథిలం కావడంతో పాడి తదితర గ్రామాల వారు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుని రాకపోకలు పునరుద్ధరించుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాలుగు ఖానాలుపై సిమెంట్ కాంక్రీట్ పూర్తిగా కొట్టుకుపోవడంతో కాకుండా పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ప్రస్తుతం నడిచి వెళ్లే పరిస్థితులు లేకపోయాయి. గత ఏడాది ఈ వంతెన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్టు పాలకులు ప్రకటించారు తప్పితే పనులు ప్రారంభించలేదు. ఈ వంతెన నిర్మాణం కేవలం ఎన్నికల హామీగానే మిగిలిందని, ఇప్పటికైనా అధికారులు నిధులు కేటాయించి వంతెన నిర్మాణాలు చేపట్టి రవాణా పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



చోడిరాయి వద్ద కర్రలతో వంతెన వేసుకుంటున్న గిరిజనులు

దెబ్బతిన్న చోడిరాయి, మాదిమళ్లు వంతెనలు

సీలేరు: గూడెంకొత్తవీధి మండలంలోని ధారకొండ-గుమ్మిరేవుల మార్గంలో తీవ్ర వాయుగుండం ప్రభావానికి కొండపై కురిసిన భారీ వర్షాలతో చోడిరాయి, మాదివళ్లు వంతెనలు దెబ్బతిన్నాయి. దీంతో సుమారు 60 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుమ్మిరేవుల పంచాయతీ సరిహద్దులో ఉన్న పాతకోట, గుర్తేడు పంచాయతీల ప్రజలు నిత్యావసర సరకులు, అత్యవసర సరిస్థితుల్లో వైద్యం కోసం ధారకొండ ఆసుపత్రికి రావాలన్నా ఈ వంతెనలను దాటాలి. చోడిరాయి వంతెన కొట్టుకుపోవడంతో వాగు నీరు కూడా ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో చోడిరాయి, నేలజర్త, పరిసర గ్రామాల గిరిజనులు వాగుపై కర్రలతో తాత్కాలికంగా వంతెన ఏర్పాటుచేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వంతెన మరమ్మతు చేయించి రాకపోకలు పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే మెడికల్ సీట్ల తగ్గింపు

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పాడేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే మెడికల్ కాలేజీలో ఈ ఏడాది ప్రవేశాల్లో సీట్లు తగ్గాయని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆరోపించారు. శనివారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసిన స్థానిక మెడికల్ కాలేజీలో ఈ ఏడాది 150 సీట్లకు ప్రవేశాలు కల్పించాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం అశ్రద్ధ కారణంగా కేవలం 50 సీట్లకే పరిమితమైందన్నారు. 150 సీట్లకు అవసరమైన ఫ్యాకల్టీ, సదుపాయాలు కల్పించలేమని కూటమి ప్రభుత్వం నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు పేర్కొనడం వల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో వైద్య రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పాడేరులో మెడికల్ కాలేజీని ఏర్పాటు చేస్తే, కూటమి ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరించడం దారుణమని వాపోయారు. దీనివల్ల తమకు మెడికల్ సీట్లు వస్తాయని ఆశించిన విద్యార్థులకు కూటమి ప్రభుత్వ అన్యాయం చేసినట్లేనన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరుమార్చుకుని స్థానిక మెడికల్ కాలేజీలో 150 సీట్లకు ప్రవేశాలు కల్పించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు.

చర్మ వ్యాధుల నివారణకు సబ్బులు పంపిణీ



విద్యార్థులకు సబ్బులు పంపిణీ చేస్తున్న ఏటీడబ్ల్యూవో

పాడేరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు చర్మ వ్యాధుల నివారణకు అవసరమైన సబ్బులను పంపిణీ చేస్తున్నారు. మండలంలోని డి.మోదాపుట్టు, స్థానిక ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం ఏటీడబ్ల్యూవో ఎల్.రజనీ, ఉపాధ్యాయులు సబ్బులను పంపిణీ చేశారు. ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు ఇటీవల చర్మ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి 3,500 మంది బాధిత విద్యార్థులను గుర్తించారు. దీంతో వారందరికీ చర్మ వ్యాధుల నివారణకు అవసరమైన సబ్బులు పంపిణీ చేయాలని చేయాలని ఐటీడీఏ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా మండలంలోని పలు ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీసీసీ పెట్రోల్ బంక్ ట్యాంకర్లలో వర్షం నీరు



ట్యాంకర్లలో నీటిని తొలగిస్తున్న సిబ్బంది

చింతపల్లి, సెప్టెంబరు 14: గిరిజన సహకార సంస్థ పెట్రోల్ బంక్ ట్యాంకర్లు వర్షపు నీటితో నిండిపోవడంతో విక్రయాలను నిలిచిపోయాయి. గిరిజన ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు భూగర్భంలోని పెట్రోల్ ట్యాంకర్ల వద్ద ఊటలు బయటపడ్డాయి. దీంతో ట్యాంకర్లు చుట్టూ నీరు చేరుకున్నది. ట్యాంకర్లలోని పెట్రోల్, డీజిల్‌లో కూడా నీరు కలిసి ఉంటుందని భావించి శనివారం నుంచి పెట్రోల్ డీజిల్ విక్రయాలను జీసీసీ అధికారులు నిలిపివేశారు. ప్రస్తుతం హెచ్‌పీసీఎల్ టెక్నికల్ ఉద్యోగులు వచ్చి ట్యాంకర్ల వద్ద చేరిన వర్షపు నీటిని బయటకు తోడుతున్నారు. రెండు రోజుల్లో జీసీసీ పెట్రోల్ బంక్ వినియోగంలోకి తీసుకొస్తామని ఇన్‌చార్జి రామకృష్ణ తెలిపారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సేవలు అభినందనీయం

▸▸ పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యూవీ గిరి

చింతపల్లి, సెప్టెంబరు 14: డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి సేవలు అభినందనీయమని పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ సేవలను అభినందిస్తూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో డిగ్రీ కళాశాలలో 50 శాతం విద్యార్థుల హాజరు ఉండేదికాదన్నారు. ప్రస్తుతం ప్రతీ రోజు 95 శాతానికిపైగా విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో స్టడీ కాలాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షణ కోసం అధ్యాపకులను నియమించడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు కళాశాలకు వెళ్లాలనే భావన కలిగేలా ప్రిన్సిపాల్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. డిగ్రీ కళాశాలకు పీజీ సెంటర్‌ని తీసుకొచ్చేందుకు ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు గెమ్మెలి మోహన్‌రావు, బౌడు గంగరాజు, ముర్ల వెంకటరమణ, రామరాజుపడాల్, గ్రంథాలయాధికారి జగ్గత్‌రాయ్, జూనియర్ అసిస్టెంట్ నాగరాజు పాల్గొన్నారు.

జలాశయాల్లో కొనసాగుతున్న నీటి విడుదల

బలిమెల రిజర్వాయర్ నుంచి 14776 క్యూసెక్కులు, గుంటవాడ 2700, డొంకరాయి 10800 క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరులో మూడు యూనిట్లు, పొల్లూరులో యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి

సీలేరు, సెప్టెంబరు 14: జలాశయాల్లో నీటి విడుదల కొనసాగుతోంది. బలిమెల జలాశయానికి ఇన్‌ఫ్లో కాస్త తగ్గుముఖం పట్టడంతో దిగువన ఉన్న గుంటవాడ జలాశయానికి శనివారం ఉదయం నుంచి నీటి విడుదల తగ్గించారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో బలిమెల జలాశయానికి 14 వేల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో బలిమెల నుంచి నీటి విడుదలను 20 వేల క్యూసెక్కుల నుంచి 14776 క్యూసెక్కులకు తగ్గించారు. బలిమెల నుంచి నీటి విడుదల తగ్గించడంతో గుంటవాడ జలాశయం నుంచి నీటి విడుదలను జెన్‌కో అధికారులు తగ్గించారు. శనివారం మధ్యాహ్నానికి గుంటవాడ జలాశయం నీటిమట్టం 1357.60 అడుగుల ఉండగా, ఒక గేటు ద్వారా 2700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే విద్యుత్పత్తి కోసం జలవిద్యుత్ కేంద్రానికి 8100 క్యూసెక్కులు నీటిని రెగ్యులేటర్ డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు. సీలేరు నుంచి జనరేషన్‌తో కలసి మొత్తం 10800 క్యూసెక్కులు, డొంకరాయి జలావయంలోకి చేరుతుంది. డొంకరాయి జలావయంలో ప్రస్తుతం 1033.60 అడుగులు కాగా, డొంకరాయి జలాశయం నుంచి మూడు గేట్లు ద్వారా 10800 క్యూసెక్కులు, పవర్ కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి 2500 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సీలేరులో మూడు యూనిట్లు, పొల్లూరులో ఒక యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు.

దుప్పులవాడలో విద్యుత్ పునరుద్ధరణ పనులు

ఆరు రోజులుగా అంధకారంలోనే గిరిజన గ్రామాలు

అతి కష్టంపై లైన్లు సరిచేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



నాటుపడవపై వైర్లు తీసుకొస్తున్న సిబ్బంది



మారుమూల గ్రామాలకు గిరిజనులే వైరును మోసుకుని వెళ్తున్న దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 14: భారీ వర్షాలకు దుప్పులవాడ పంచాయతీ పరిధిలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు గ్రామస్థుల సహకారంలో సంబంధిత అధికారులు శనివారం చేపట్టారు. గత ఆదివారం కురిసిన భారీ వర్షాలకు దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, వైర్లు తెగిపోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీంతో దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని చాలా గ్రామాలు చీకట్లోనే మగ్గుతున్నాయి. సీలేరు-ధారకొండ రాకపోకలకు అడ్డంకులు తొలగించడంతో దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని సరిహద్దుల్లో ఉన్న పిల్లిగెడ్డ, కాట్రగెడ్డ, జొన్నమామిడి, సంతనేరేడుపల్లి గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరణ పనులను ఈపీడీసీఎల్ సిబ్బంది చేపట్టారు. పలు గ్రామాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభాల నుంచి సిల్వర్ వైరును దొంగలు చోరీ చేశారు. దీంతో ధారకొండ సబ్ స్టేషన్ నుంచి అతి కష్టమ్మీద నాటుపడవపై వైరును తీసుకువెళ్లి పిల్లిగెడ్డ, కాట్రగెడ్డలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను సరి చేస్తున్నారు.

చట్రాపల్లి గిరిజనులకు నిత్యావసర సరకులు



గిరిజనులకు సరకులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 14: కొండచరియలు విరిగిపడడంతో నిరాశ్రయులైన చట్రాపల్లి గిరిజనులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. చింతపల్లి, జీకే వీధి మండలాల నాయకులు శనివారం చట్రాపల్లిని సందర్శించారు. సప్పర్ల పునరావాస కేంద్రంలో ఉన్న గిరిజనులకు బియ్యం, ఇతర సరకులను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు వంతల సుబ్బారావు మాట్లాడుతూ కొండచరియలు విరిగి పడడంతో ఓ మహిళ మృతి చెందడం, ముగ్గురు గాయపడడం, స్థానిక ఆదివాసీలు గృహాలు, పశుసంపద, పంటలు నష్టపోవడం బాధాకరమన్నారు. చట్రాపల్లి గిరిజనులు కోలుకునే వరకు ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాంగి గురుమూర్తి, బొజ్జన్న, కోనా ఎల్లారావు, చిరంజీవి పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: చట్రాపల్లి గిరిజనులకు కూటమి ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి అన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లు రమేశ్ నాయుడు, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు కొట్టగుళ్లి సుబ్బారావుతో కలిసి శనివారం గ్రామాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. ప్రతీ కుటుంబానికి బియ్యం, నూనె, పప్పు, కూరగాయలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్రాపల్లి గిరిజనులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతీ కుటుంబానికి పక్కా గృహాలు నిర్మించడం జరుగుతుందని, గిరిజనులు భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమెలి చిట్టిబాబు, ముక్కలి కల్యాణి, సత్యనారాయణ, కొర్ర బలరామ్, ముక్కలి మహేశ్, వెంకటలక్ష్మి, గంగరాజు పాల్గొన్నారు. అలాగే జీవీ వీధి మండల నాయకులు గంటా నళిని, ముక్కలి రమేశ్, పందురాజు, లింగమూర్తి, మొట్టడం రాజారావు, చిట్టిబాబు, రామారావు, బోయిన రామారావు వ్యక్తిగత నిధులు సేకరించి బాధితులకు సహాయం చేశారు.

మండలంలోని మూలగరువు వరద బాధిత గిరిజనులకు రెవెన్యూ అధికారులు నిత్యావసర సరకులు, వంటసామగ్రి, దుస్తులు పంపిణీ చేశారు. రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మూలగరువు గిరిజనుల గృహాలు దెబ్బతిన్నాయి. గృహసామగ్రి, ఆహార ధాన్యాలు కొట్టుకుపోయాయి. దీంతో జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాలతో శనివారం గ్రామాన్ని సందర్శించిన రెవెన్యూ అధికారులు, గిరిజనులకు బియ్యం, నిత్యావసర సరకులు, వంటపాత్రలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ కుమారస్వామి, ఆర్‌ఐ మహదేవ్, మండల వ్యవసాయ శాఖాధికారి మధుసూదనరావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ సూరిబాబు, వీఆర్వో సత్యనారాయణ పాల్గొన్నారు.

బొర్రా గుహలకు మహర్దశ

... 5వ పేజీ తరువాయి



పెడతారు. కొత్తగా విద్యుద్దీపాలు అమరుస్తారు. సీసీ టీవీ కెమెరాలు వంటివి ఉంటాయి.

సౌండ్ అండ్ లైటింగ్ షో

గుహ లోపలి అందాలను విభిన్న కోణాల్లో చూపించడానికి సౌండ్ అండ్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటుచేస్తారు. దాంతో కళ్ల ముందు రంగుల ప్రపంచం ఆవిష్కృతమవుతుంది. ఇది మరిచిపోలేని అనుభూతి కలిగిస్తుంది.

ప్రస్తుతం ఉన్నవారికి ఉపాధి

ఈ ప్రాజెక్టును ఏడాదిలో పూర్తిచేయాలనేది లక్ష్యం. టెండర్‌ను ఎవరైతే దక్కించుకుంటారో వారే దీనిని ఐదేళ్లు నిర్వహించాలి. నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి ఆదాయం ఇవ్వాలి. ప్రస్తుతం బొర్రా గుహల్లో ఏపీటీడీసీ తరపున ఇద్దరు ఉద్యోగులు, స్థానిక గిరిజన యువత 40 మంది పనిచేస్తున్నారు. కాంట్రాక్టు దక్కించుకున్నవారు వారందరికీ ఉపాధి కల్పించాలి. నిబంధనల ప్రకారం జీతాలు ఇవ్వాలి. అవసరమైతే మరింత మందిని తీసుకోవాలి. కాంట్రాక్టు కాలం పూర్తయిన తరువాత ఆ 40 మందికి మళ్లీ ఏపీటీడీసీ ఎప్పటిలాగే అవకాశం కల్పిస్తుంది. ఈ ప్రాజెక్టుకు టెండర్లు సమర్పించడానికి ఈ నెల 24వ తేదీ వరకు గడువు ఇచ్చినట్టు పర్యాటక శాఖ ప్రాంతీయ డైరెక్టర్ శ్రీనివాస పాణి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

గిరి శిఖర గ్రామాలకు గండమే!

... 5వ పేజీ తరువాయి

విరిగిపడిన ఘటనలో ఆ గ్రామానికి చెందిన 19 మంది గిరిజనులు మట్టిలోనే సమాధి అయ్యారు. ఆ తర్వాత సైతం అనేక ఘటనలు జరిగాయి. తాజాగా జీకేవీధి మండలం చట్రాపల్లిలో కొండచరియ కారణంగా ఒక యువతి మృతి చెందగా.. నిమ్మచెట్టు గ్రామంపై కొండచరియలు, భారీ చెట్లు, బురద కొట్టుకు వచ్చాయి. సంఘటనలు జరిగినపుడు స్పందించడం సహజం. కాని సంఘటనలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేలా గిరి శిఖర గ్రామాల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గిరిజన సంఘాలు, ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

జలపాతాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

... 5వ పేజీ తరువాయి

దారకొండ, రంప, తదితరల జలపాతాల వద్ద అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని పోలీసులను కలెక్టర్ ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు తిరిగి క్షేమంగా ఇళ్లకు వెళ్లాలని సూచించారు. అలాగే అధికారులు ఆయా జలపాతాల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

హుకుంపేట సమస్యలపై వినతి

హుకుంపేట, సెప్టెంబరు 14: మండలంలోని సమస్యలను పరిష్కరించాలని అరకు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌కు శనివారం వినతిపత్రం అందించారు. అరకు నియోజకవర్గ ఎస్టీ సెల్ కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తుఫాన్‌తో వంతెనలు ధ్వంసమయ్యాయని, రహదారులు అధ్వానం మారాయని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనికి శ్రావణ్ స్పందిస్తూ, అధికారులతో సమీక్షించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామలింగం, జి.గంగరాజు పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖం.. అంతలో ఆనందం

కుమార్తెను దహనపరిచిన కొద్ది గంటల్లో మరో బిడ్డకు జన్మనిచ్చిన మాతృమూర్తి



ఆస్పత్రిలో పసి బిడ్డతో మాతృమూర్తి జ్యోతి

అనంతగిరి, సెప్టెంబరు 14: అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె దూరమైందన్న పుట్టెడు దుఃఖంలో ఉన్న ఓ మాతృమూర్తి... ఆ కుటుంబానికి, అంతలోనే ఊరటనిచ్చే ఆనందం మరో బిడ్డ రూపంలో ఎదురొచ్చింది.

ఎగువశోభ పంచాయతీ పోర్లపోదొర్ గ్రామానికి చెందిన పాంగి దాసు, జ్యోతి దంపతులకు.. రెండు, మూడో కాన్పులో పుట్టిన ఇద్దరు చిన్నారులు రెండు నెలల వయస్సులో అనారోగ్యంతో మృత్యువాతపడ్డారు. నాలుగో కాన్పులో పుట్టిన పాంగి జెస్సిక (4) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందింది. అల్లారు ముద్దుగా పెంచుకున్న కుమార్తె తమను వదిలి వెళ్లిపోయిందంటూ తల్లిదండ్రులు దాసు, జ్యోతి శోక సంద్రంలో మునిగిపోయారు. జెస్సికాకు గురువారం దహన సంస్కారాలు నిర్వహించారు. అదే రోజు మధ్యాహ్నం జ్యోతికి పురిటి నొప్పులు రావడంతో అనంతగిరి పీహెచ్‌సీలో చేర్చారు. వైద్యాధికారి జ్ఞానేశ్వరి ప్రత్యేక చొరవ తీసుకుని సేవలు అందించడంతో శుక్రవారం ఉదయం జ్యోతి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో అంబులెన్స్‌లో గ్రామానికి తరలించారు. కుమార్తె పోయిందన్న దుఃఖంలో ఉన్న తల్లిదండ్రులు, కుటుంబానికి మరో బిడ్డ రూపంలో ఆనందం ఎదురొచ్చిందని స్థానికులు పేర్కొన్నారు.